పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 89. అల్ ఫజ్ర్ సూరా పరిచయం

మక్కాలో అవతరణ : 30 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

దైవప్రవక్త (స) మక్కాలో తౌహీద్, ఆఖిరత్‌ల సందేశం ఇస్తూ ఉన్న కాలంలో ఈ సూరా అవతరించింది. ఇంకా అంతిమ దినం తప్పక వస్తుందని, దుష్కర్మలు చేస్తే పరలోకంలో కఠిన శిక్ష లభిస్తుందని ఆయన బోధిస్తూ ఉన్నారు. తిరస్కారులు దాన్ని కఠినంగా తిరస్కరించసాగారు – అంతిమ దినమూ లేదు, శిక్షా బహుమానాలూ వుండవు అని. అల్లాహ్ ఈ సూరాలో ఆఖిరత్‌కు రుజువులు పేర్కొన్నాడు.

1. రాత్రి అంతం అయి ఉదయం వచ్చినట్లే ఈ ప్రపంచం అంతం అయి ఆఖిరత్ వచ్చేస్తుంది.

2. చంద్రుడు క్రమంగా వృద్ధిచెందుతాడు. తర్వాత క్రమంగా చంద్రుని క్షీణత ఆరంభమవుతుంది. తల్లి కడుపులోని పిండం క్రమంగా పెరిగి తొమ్మిది లేక పది మాసాలలో ప్రసవం అవుతుంది. శిశువు జననం అవుతుంది. చంద్రునికి ఒక వ్యవధి, ప్రసవానికి ఒక వ్యవధి ఏ విధంగా ఉన్నాయో అదే విధంగా ఈ ప్రపంచానికీ ఒక వ్యవధి ఉంది. గడువు తీరగానే అంతిమదినం (ఆఖిరత్) ఆరంభమవుతుంది. ఈ విధంగా ప్రతిదానికీ ఒక జంట వుంది. భూమికి జంట ఆకాశం, పెంటి – పోతు, స్త్రీ పురుషుడు ఒక జంట. ఇదే విధంగా ప్రపంచానికి జంట పరలోకం. కాబట్టి అంతిమదినం తప్పక రానున్నది.

పైన తెలిపిన రుజువుల వెలుగులో బుద్ధిశాలి అయిన మనిషి ఆఖిరత్ విషయాన్ని అది తప్పక వస్తుందని, ఆఖిరత్ రానుండగా దానిపట్ల పరధ్యానంలో పడి ఉన్నవారు, అందుకు సన్నాహాలు చెయ్యనివారు తప్పక నాశనం అవుతారని గ్రహించగలడు. ఆఖిరత్‌ను అంగీకరించి, సత్కర్మలు చేసి, మానవుల పట్ల మంచిగా వ్యవహరించేవాడే బుద్ధిశాలి.

## 89. అల్ ఫజ్ర్

**ఆయత్‌లు : 30** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) ఉదయం సాక్షి! (2) మరియు పది రాత్రులు సాక్షి (3) మరియు సరి, బేసి సాక్షి! (4) ఇంకా రాత్రి, అది వెళ్ళిపో సాగినపుడు (5) ఒక బుద్ధిశాలికి ఈ రుజువులు చాలవా? నిస్సందేహంగా ఆఖిరత్‌ను గ్రహించడానికి ఈ రుజువులు చాలు (6) నీ ప్రభువు ఆద్ జాతితో ఎలా వ్యవహరించాడో నీవు చూడలేదా? (7) ఎత్తయిన కట్టడాలుగల ఇరమ్‌తో

آيَاتُهَا 30 سُورَةُ الْفَجْرِ مَكِّيَّةٌ 89 رُكُوعُهَا 1

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

وَالْفَجْرِ ﴿1﴾ وَلَيَالٍ عَشْرٍ ﴿2﴾ وَالشَّفْعِ وَالْوَتْرِ ﴿3﴾ وَاللَّيْلِ إِذَا يَسْرِ ﴿4﴾ هَلْ فِي ذَٰلِكَ قَسَمٌ لِّذِي حِجْرٍ ﴿5﴾ أَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِعَادٍ ﴿6﴾ إِرَمَ ذَاتِ الْعِمَادِ ﴿7﴾

الَّتِي لَمْ يُخْلَقْ مِثْلُهَا فِي الْبِلَادِ ﴿8﴾

وَثَمُودَ الَّذِينَ جَابُوا الصَّخْرَ بِالْوَادِ ﴿9﴾

وَفِرْعَوْنَ ذِي الْأَوْتَادِ ﴿10﴾

الَّذِينَ طَغَوْا فِي الْبِلَادِ ﴿11﴾

فَأَكْثَرُوا فِيهَا الْفَسَادَ ﴿12﴾

فَصَبَّ عَلَيْهِمْ رَبُّكَ سَوْطَ عَذَابٍ ﴿13﴾

إِنَّ رَبَّكَ لَبِالْمِرْصَادِ ﴿14﴾

فَأَمَّا الْإِنْسَانُ إِذَا مَا ابْتَلَاهُ رَبُّهُ فَأَكْرَمَهُ
وَنَعَّمَهُ فَيَقُولُ رَبِّي أَكْرَمَنِ ﴿15﴾

وَأَمَّا إِذَا مَا ابْتَلَاهُ فَقَدَرَ عَلَيْهِ رِزْقَهُ فَيَقُولُ
رَبِّي أَهَانَنِ ﴿16﴾

كَلَّا بَلْ لَا تُكْرِمُونَ الْيَتِيمَ ﴿17﴾

وَلَا تَحَاضُّونَ عَلَى طَعَامِ الْمِسْكِينِ ﴿18﴾

(8) దాని వంటి జాతి ఏదీ ప్రపంచంలో పుట్టించబడలేదు. (9) ఇంకా సమూద్ జాతితో అల్లాహ్ ఎలా వ్యవహరించాడో (చూడలేదా?). వారు లోయలో రాతి బండలను చెక్కేవారు. అంటే రాతి బండలను చెక్కి, ఇళ్ళు నిర్మించేవారు.

(10) ఇంకా గుడారాలు వేసి మేకులు పాతే ఫిరౌన్‌తో ఎలా వ్యవహరించాడో (చూడలేదా?)

(11) ప్రపంచంలో తలబిరుసుగా ప్రవర్తించిన వారు వీరే. (12) ఇంకా అందులో కల్లోలాన్ని వ్యాపింపజేశారు. (13) చివరకు నీ ప్రభువు వారిపై శిక్ష అనే కొరడా ఝుళిపించాడు. (14) నిజంగా నీ ప్రభువు మాటువేసి ఉంటాడు. అంటే అల్లాహ్ ఈ ప్రపంచాన్ని పర్యవేక్షిస్తున్నాడు. హద్దుమీరిన పాపాలు చేసే వారిని శిక్షించి అంతం చేస్తాడు. (15) కాని, ఈ మానవుడు భలే వింత ప్రాణి. అతని ప్రభువు అతడ్ని పరీక్షించడానికి అతడికి గౌరవం కల్పించి, వరాలతో అనుగ్రహిస్తే, నా ప్రభువు నాకు గౌరవం ప్రసాదించాడు అంటాడు. (16) ఇంకా మరో విధంగా పరీక్షించాలని అతడి ఉపాధిని తగ్గించివేస్తే నా ప్రభువు నన్ను అవమానం పాలుచేశాడు అని అంటాడు. (17) ఎంతమాత్రం కాదు. మీరు అనాథను గౌరవించరు. (18) ఇంకా నిరుపేదకు భోజనం పెట్టేందుకు ఒకరినొకరు ప్రోత్సహించుకోరు.

1 – 14 వాక్యాలు

ఈ ఆయత్‌లలో తిరస్కారులు, బహుదైవారాధకులకు వార్నింగ్ ఇవ్వబడింది. ఆద్, సమూద్ మరియు ఫిరౌన్ జాతులు హింసా దౌర్జన్యాలకు పాల్పడిన కారణంగా దైవశిక్షకు ఏ విధంగా గురి అయ్యారో అదేవిధంగా మీరు అంతం చెయ్యబడతారు. విశ్వాసులను పీడించడం, వారిపై హింసా దౌర్జన్యాలు చేయడం విడిచిపెట్టండి. ఇది మీకు ఉత్తమం, గుర్తుంచుకోండి! అంతిమదినం రానున్నది. లెక్క తీసుకోవడం జరుగనున్నది. హింసా దౌర్జన్యాలు చేసేవారు, హత్యలు ఖూనీలు చేసేవారు, కల్లోలం, ఉపద్రవాలను రేకెత్తించే వారికి పరలోకంలో బాధాకరమయిన శిక్ష ఉంది.

وَتَاْكُلُوْنَ التُّرَاثَ اَكْلًا لَّمًّا ﴿19﴾ وَّتُحِبُّوْنَ الْمَالَ
حُبًّا جَمًّا ﴿20﴾ كَلَّآ اِذَا دُكَّتِ الْاَرْضُ دَكًّا
دَكًّا ﴿21﴾ وَّجَآءَ رَبُّكَ وَالْمَلَكُ صَفًّا صَفًّا
﴿22﴾ وَجِايْٓءَ يَوْمَىِٕذٍۭ بِجَهَنَّمَ يَوْمَىِٕذٍ
يَّتَذَكَّرُ الْاِنْسَانُ وَاَنّٰى لَهُ الذِّكْرٰى ﴿23﴾
يَقُوْلُ يٰلَيْتَنِيْ قَدَّمْتُ لِحَيَاتِيْ ﴿24﴾ فَيَوْمَىِٕذٍ
لَّا يُعَذِّبُ عَذَابَهٗٓ اَحَدٌ ﴿25﴾ وَّلَا يُوْثِقُ وَثَاقَهٗٓ
اَحَدٌ ﴿26﴾ يٰٓاَيَّتُهَا النَّفْسُ الْمُطْمَىِٕنَّةُ ﴿27﴾
ارْجِعِيْٓ اِلٰى رَبِّكِ رَاضِيَةً مَّرْضِيَّةً ﴿28﴾
فَادْخُلِيْ فِيْ عِبٰدِيْ ﴿29﴾ وَادْخُلِيْ جَنَّتِيْ ﴿30﴾ ع 1 30 14

(19) మరియు వారసత్వపు ఆస్తి మొత్తం స్వాహా చేస్తారు. (20) ధనవ్యామోహంలో దారుణంగా చిక్కుకుని ఉన్నారు. (21) ఎంతమాత్రం కాదు. భూమి నలగ్గొట్టబడి చదునుగా చేయబడినప్పుడు (22) నీ ప్రభువు కొలువు తీరి ఉండగా దూతలు బారులు తీరి నిలబడి ఉంటారు. (23) నరకం ఆ రోజున హాజరు పర్చబడుతుంది. ఆ రోజున మనిషికి అర్థమవుతుంది. ఆ రోజున అర్థం అయినందువల్ల ప్రయోజనం ఉండదు. (24) అయ్యో! నేను పరలోక జీవితం కోసం ముందునుండే కొన్ని పుణ్యాలు చేసి ఉండవలసింది అని అంటాడు. (25) తర్వాత ఆ రోజు అల్లాహ్ విధించే శిక్ష, అలాంటి శిక్ష, విధించే వాడు ఎవరూ లేరు (26) అలా పట్టుకొనే వాడు ఎవరూ లేరు (27) (అల్లాహ్ అంటాడు) సంతృప్తి చెందిన మనసా! (28) నీ ప్రభువు వైపునకు పద, నీవు ఆయన్ని ఇష్టపడ్డావు, ఆయన నిన్ను ఇష్టపడ్డాడు. (29) నీవును నా పుణ్యాత్ములయిన దాసులలో చేరిపో (30) నా స్వర్గంలో చేరిపో.

15 - 20 వాక్యాలు

ఐశ్వర్యం, సుసంపన్నత అదేవిధంగా పేదరికం, దారిద్ర్యం ఇవి పరీక్ష కోసం మాత్రమే. సంపద కారణంగా అల్లాహ్ ఎవరివల్లా సంతోషించడు. దారిద్ర్యం వల్ల అల్లాహ్ ఎవరినీ అయిష్టపడడు. ఇవి పరీక్ష కోసమే. సంపదనిచ్చి అల్లాహ్ పరీక్షిస్తాడు. మనిషి సంపద కలిగి ఉండి అల్లాహ్‌కు కృతజ్ఞత చూపుతాడా? కృతఘ్నుత చూపుతాడా అని. ఇంకా సంపద కలిగి పేదలు, అనాథలు, అగత్యపరుల హక్కు చెల్లిస్తాడా లేక సిరిసంపదల వ్యామోహంలో చిక్కుకుని పిసినారిగా మారిపోతాడా? అని పరీక్షిస్తాడు.

సంపద కలిగిన మనిషి అనాథలు, పేదలకు తోడ్పడాలి. దైవప్రవక్త (స) సెలవిచ్చారు : “ముస్లిం‌ల ఇళ్ళలో ఎవరి ఇంటిలోనయితే అనాథపట్ల సద్వ్యవహారణ జరుగుతుందో ఆ ఇల్లు ఉత్తమమయిన ఇల్లు. ఏ ఇంటిలోనయితే అనాథ ఉండి, ఆ అనాథ పట్ల దుర్వ్యవహారణ జరుగుతుంటుందో ఆ ఇల్లు పరమ దౌర్భాగ్యకరమయిన ఇల్లు. (తఫ్సీర్ ఇబ్నె కసీర్) దైవప్రవక్త (స) సెలవిచ్చారు : “నేనూ, అనాథను సంరక్షించే వాడు స్వర్గంలో ఇలా ఉంటాం” అంటూ రెండు వ్రేళ్లను చూపుడు వేలు, దాని ప్రక్కవేలితో కలిపి సైగ చేశారు. (అబూదావూద్)

రెండు వ్రేళ్ళూ కలుసుకొని ఒకదాని దగ్గరగా మరొకటి ఎలా ఉంటాయో అదేవిధంగా అనాథను సంరక్షించేవారు ప్రవక్త పొరుగున, దైవప్రవక్త (స)కు సమీపంలో ఉంటారు. అదేవిధంగా పేదరికం, దారిద్ర్యం ఇచ్చి నా దాసుడు పేదరికంలో ఓర్పు వహిస్తాడా? లేదా ఈ స్థితిలో కూడ తనను స్మరిస్తాడా? అని అల్లాహ్ పరీక్షిస్తాడు. కొన్ని గంటల పాటు రాత్రి ఉండి, ఆ తర్వాత అది వెళ్ళిపోయినట్లే దుఃఖం, విచారం, పేదరికం దారిద్ర్యం కూడ కొన్నాళ్ళవరకే. మనిషి గనక ఇటువంటి రోజులలో ఓర్పుతో ఉంటే అతి త్వరలోనే అల్లాహ్ కష్టాలను దూరం చేస్తాడు. తిరిగి జీవితంలో సుఖసంతోషాలను తెస్తాడు.